సాక్షి
కుమురం భీం

సోమవారం ¦ 27 ¦ మే ¦ 2024



రైతులూ.. జాగ్రత్త!

ఖరీఫ్ ప్రారంభం కానుండడంతో మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు చేరుతున్నాయి. రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా లేకుంటే నష్టపోయే ప్రమాదముంది. 8లో ▸



ఆరోగ్యానికి శాకాహారం!

రోజూ వ్యాయామం చేస్తూ.. పోషక విలువలతో కూడిన కూరగాయలు, ఆకుకూరలు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని చెబుతున్నారు. 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0 /32.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా, పలుచోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

28 నుంచి సెమిస్టర్ పరీక్షలు

కాగజ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్–1 పరీక్షలు ఈనెల 28నుంచి ప్రారంభమవుతాయని కళాశాల కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైన గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. లేనిపక్షంలో పరీక్షాకేంద్రంలోకి అనుమతించబోమని పేర్కొన్నారు.

సమస్య పరిష్కరించాలి



బీసీ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని సాలెగూడా గ్రామంలోగల గాంధీచౌక్ బీసీ కాలనీలో ప్రధాన రహదారిపై మోకాళ్లలోతు వర్షపు నీరు నిలిచింది. దీంతో కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి నేపథ్యంలో అడపాదడప కురిసిన వర్షాలకు రహదారిపై నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెందాయి. గ్రామస్తులు అనేక రోగాల బారిన పడుతున్నారు. అధికారులు కనీసం నీటిని తొలగించే చర్యలు కూడా తీసుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మిస్తే నీటి నిల్వ సమస్య కొంతమేర తీరుతుందని పేర్కొంటున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏమాత్రం స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే రోడ్డుపై మురుగునీటిని తొలగించి భవిష్యత్‌లో మళ్లీ నిలువకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఫీజు నియంత్రణ చట్టం తేవాలి



మాట్లాడుతున్న జాఫర్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు క్రమబద్ధమైన విధానాన్ని తీసుకురావాలని కోరారు. అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా పాఠశాలల ఫీజు నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఎస్‌ఎఫ్‌ఆర్‌సీ) తరహాలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పర్యవేక్షణ, నియంత్రణ కమిటీ వేయాలని కోరారు. దేశంలో 15 రాష్ట్రాల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలులో ఉందని గుర్తు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే యూనిఫాంలు, పుస్తకాలు, బూట్లు, టై బెల్టులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయక కార్యదర్శి సాయి, నాయకులు తిరుపతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



మాట్లాడుతున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్

నార్నూర్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని, చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్నా ఉపేక్షించేది లేదని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ వర్గాల పెద్దలతో ఆదివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ మండలాలైన జైనూర్, నార్నూర్, ఉట్నూర్ లాంటి ప్రాంతాల్లో వ్యక్తిగత గొడవలైనప్పటికీ, కొంతమంది రెండు వర్గాల మధ్య గొడవగా సృష్టిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. అందరూ సోదర భావంతో కులమతాలకతీతంగా కలిసిమెలిసి ఉంటే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సీఐ రహీంపాషా, గాదిగూడ ఎస్సై మహేశ్‌కుమార్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు జ్ఞానోబా పుష్కర్, సర్పంచ్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, నాయకులు జాక్రుల్లాఖాన్, సత్తార్, హసన్‌ఖాన్, బాబాఖాన్, ఆటోడ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్ ఉన్నారు.

ప్రత్యేక పాలనలో పరేషాన్

- నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు
- పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తం
- కార్యదర్శులపై పడుతున్న భారం
- అప్పులు చేసి పనులు చేస్తున్న వైనం



మిషన్ భగీరథ నీరు రాక వాగులోని చెలిమెలో నీరు తోడుతున్న మర్తిడి గ్రామస్తుడు

బెజ్జూర్: ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామపంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడింది. ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఏడాది జనవరి 31తో సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అయితే నిధులు లేక పంచాయతీల నిర్వహణ భారంగా మారుతోంది. దీంతో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కొరవడింది. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవడంతో కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఫిబ్రవరి 1న ప్రభుత్వం క్లస్టర్ గ్రామాలుగా ఎంపిక చేసి జిల్లాలోని 335 గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం నిధులు, విధులపై స్పష్టత ఇవ్వకపోవడం ప్రధాన సమస్యగా మారింది. గ్రామపంచాయతీ బ్యాంక్ ఖాతాలు ఖాళీగా ఉండటంతో కనీసం విద్యుత్ బిల్లులు, బోరు మరమ్మతులు, చెత్త సేకరణ వాహనాలకు డీజిల్ కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. అలాగే పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు చెల్లించలేని దుస్థితి ఉండగా వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో పంచాయతీ కార్యదర్శులు

గ్రామపంచాయతీల నిర్వహణ భారంగా మారి పంచాయతీ కార్యదర్శులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. గ్రామపంచాయతీ బ్యాంక్ ఖాతాలు ఖాళీగా ఉండటంతో నిర్వహణ గాడి తప్పింది. గతంలో చెత్త సేకరణకు కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ఆటోలు పంచాయతీ కార్యదర్శుల పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయి. దీంతో పంచాయతీల్లో ఉన్న నిధులను ముందస్తుగానే వీటి వాయిదాలు చెల్లించడంతో పంచాయతీ బ్యాంక్ ఖాతాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యవసర పనులైన మురుగు కాలువల మరమ్మతు, తాగునీటి పైపులైన్ లీకేజీలు సరిచేసేందుకు డబ్బులు లేక తప్పనిసరి పరిస్థితుల్లో మౌలిక వసతుల కల్పనకు పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేయక తప్పడం లేదు. వేసవిలో నీటి సౌకర్యం లేక కొన్ని గ్రామపంచాయతీలో ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. సమీప వాగుల్లో చెలిమెలు తోడి నీటిని తెచ్చుకుంటున్నారు. మిషన్ భగీరథ నీరు గ్రామాలకు అందడం లేదు. దీంతో సమీపంలోని వాగులు, వంకల నుంచి తాగునీరు తీసుకువచ్చే పరిస్థితులు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో రాత్రి వేళ వీధిదీపాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని చెప్పినప్పటికీ నిధులు రాక ఇబ్బందుల్లో ఉన్నామని సమాధానం చెబుతున్నారు. గ్రామపంచాయతీల్లో తడి, పొడి చెత్త సేకరణ దాదాపు కనుమరుగైనట్లే. గ్రామపంచాయతీ ట్రాక్టర్లు డీజిల్ లేక మూలన పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రత్యేకాధికారులు పట్టనట్లు ఉండడం గమనార్హం.

కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు

ప్రత్యేకాధికారులు గ్రామపంచాయతీల వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ప్రధాన ఆధారం. జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి రూ.812 చొప్పున 15 ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కానీ.. 2022, ఆగస్టు నుంచి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. పెద్ద పంచాయతీల్లో ఇంటి, వ్యాపార పన్నులు, తైబజార్, ఇంటి నిర్మాణ ఫీజులు, వ్యాపార వాణిజ్య లైసెన్స్ ఫీజుల ద్వారా డబ్బులు జమవుతాయి. అలాగే చిన్న గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే నిధులు మినహా ఇతర ఆర్థిక మార్గాలు లేవు. పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పడటంతో తప్పనిసరి పరిస్థితుల్లో చెత్త తరలింపు వాహనాలతో పాటు నీటిని సరఫరా చేసే ట్యాంకర్ డీజిల్ కొనుగోలుకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నీరు రావడం లేదు



గ్రామాల్లో నీటి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నాం. వీధిదీపాలు, పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రత్యేకాధికారులు గ్రామపంచాయతీల్లో తిరిగిన దాఖలాలు కనిపిస్త లేవు. సమస్యలు తిష్ట వేస్తున్నాయి. అధికారులకు చెప్పినా స్పందించడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– బుస సారయ్యయాదవ్, మర్తిడి

వేతనాలు వస్తలేవు



కొన్ని నెలలుగా జీతాలు రాక ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రత్యేకాధికారుల పాలనలోనూ జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేయించి ఆదుకోవాలి.

– గోరంట్ల వసంత్, మల్టీ పర్పస్ ఉద్యోగి, బెజ్జూర్

ఖరీఫ్‌కు సన్నద్ధం



తలోడి శివారులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

- వేసవి దుక్కులతో ప్రయోజనం
- తెగుళ్ల నివారణకు అవకాశం
- అన్నదాతలకు అధిక దిగుబడి

కౌటాల: వేసవి దుక్కులు దున్నే పద్ధతి అనాదిగా వస్తున్న సంప్రదాయం. నీటిని నిల్వ చేసుకునేందుకు ఇదో చక్కటి మార్గం. నేలలో నీటి శాతం పెరుగుతుంది. సుమారు 20రోజుల పాటు వర్షం కురవకపోయినా ఇంకిన నీటితడి మొక్కలకు అందుతుంది. దీంతో ఖర్చులు తక్కువే కాకుండా ప్రయోజనాలు ఎక్కువగా ఉండటంతో వేసవి దుక్కులు దున్నుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. యాసంగి సాగు అనంతరం భూసారాన్ని పెంచేందుకు చేపట్టే వేసవి దుక్కులు రైతులకు పలు ప్రయోజనాలను చేకూర్చుతాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వేసవిలో గతేడాది ఖరీఫ్‌లో వేసిన పత్తి తీసిన తర్వాత ఎండిన మొక్కలను కాల్చిన అనంతరం రైతులు దుక్కులు దున్నిస్తున్నారు. వేసవిలో ఎండిన పత్తి కర్రను కాల్చడంతో భూమిలోని చీడపీడలు నశిస్తాయి. వేసవి దుక్కులతో మంచి లాభాలున్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. సరిపడా తేమ ఉన్న చేన్లు, పొలాల్లో సుమారు తొమ్మిది అంగుళాల లోతు తగ్గకుండా దుక్కులు దున్నుకుంటే ప్రయోజనముంటుంది.

30వేల ఎకరాల్లో సాగు

కౌటాల మండలంలో ఖరీఫ్‌లో 30వేల ఎకరాల్లో సాగుకు రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. ఈసారి పత్తి 20 వేల ఎకరాలు, వరి 8వేలు, కంది 2వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు ఇప్పటికే 40–50 శాతం మేర దుక్కులు దున్నుకున్నారు. మిగతా 50 శాతం మంది సన్నద్ధమవుతున్నారు. తొలకరికి ముందు వేసవిలో వేసిన పంటను తొలగించడంలో రైతులకు బహుళ ప్రయోజనం ఉంటుంది. గతంలో వేసిన పంటల అవశేషాలు దుక్కిలో కుళ్లి కర్బన శాతం పెరుగుతుంది. నేలలో పురుగులు, వాటి గుడ్లు ఉన్నట్లయితే దున్నిన తర్వాత పైకి తేలడంతో సూర్యరశ్మి తగిలి చనిపోతాయి. నీటి నిల్వ సామర్థ్యం 50 శాతం పెరిగి సుమారు 20రోజుల వరకు వాన కురవకపోయినా ఇంకిన నీటితడి మొక్కలకు అందుతుంది.

నేల సారవంతానికి..

వేసవి దుక్కులు దున్నే ముందు భూమిలో పశువులు, ఎరువులు, కంపోస్టు, చెరువు మట్టి వెదజల్లితే నేల సారవంతంగా మారుతుంది. లోతు దుక్కులతో కలుపు మొక్కలు మట్టి కిందికి చేరి సేంద్రియ ఎరువుగా మారుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. లోతు దుక్కులు దున్నినప్పుడు నేల పైపొరల్లో ఉండే పురుగులు, తెగుళ్లను నశింపజేయడానికి అవకాశం ఉంటుంది. కలుపు మొక్కలు, కాయలు, దుంపలు, వేర్లు పెకిలించబడి వేసవి ఉష్ణోగ్రతలకు నశించడానికి అవకాశం ఉంటుంది. నేల పైకి తేలిన కాయలు, దుంపలు, వేర్లను ఏరివేయొచ్చు.

దున్నకుంటే కలిగే నష్టాలు

కోతల తర్వాత దుక్కి దున్నకుండా వదిలేస్తే అవసరమైన సమయంలో భూమి బీడుగా మారే ప్రమాదముంది. భూమి గాలిని పీల్చుకునే శక్తి కోల్పోతుంది. లోతైన పొరల నుంచి నీరు ఆవిరై పోతుంది. కలుపు మొక్కలు పెరిగి అవి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూసారాన్ని తగ్గిస్తాయి. విత్తడానికి వారం, పదిరోజుల ముందు దుక్కులు దున్నితే ఆశించిన దిగుబడి రాదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ఖర్చులు తగ్గుతాయి



ఏటా వేసవి దుక్కులు దున్నుకుంటాం. నాకున్న ఐదెకరాల్లో ట్రాక్టర్లతో వేసవిలోనే దున్నిస్తా. లోతుగా దుక్కి దున్నడంతో రాలిన ఆకులు నేలలో కలిసి కుళ్లిపోతాయి. సేంద్రియ ఎరువులు చల్లి మళ్లీ దున్నుకుంటాం. దీంతో వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోనే ఇంకుతుంది. పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయి.

– దుర్గం శివారం, యాపలగూడ

అధిక దిగుబడి వస్తుంది



వేసవిలో దుక్కులు దున్నుకుంటే నేలలోని పురుగులు చనిపోతాయి. నేలలో సేంద్రియ కర్బన శాతం, పోషక పదార్థాలు పెరుగుతాయి. రైతులు ఆలస్యంగా దున్నితే పురుగులు, తెగుళ్లు ఎక్కువగా వస్తాయి. జీలుగ విత్తనాలు వేస్తే భూమి గుల్ల బారి నేల సారవంతమవుతుంది. విత్తనాలు మొలకెత్తి, పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

– పాలకుర్తి రాజేశ్, ఏవో, కౌటాల

భీం ఆశయ సాధనకు కృషి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: కుమురంభీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ, కుమురంభీం మనవడు కుమురం సోనేరావు సూచించారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కుమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'జల్ జంగల్ జమీన్' కోసం పోరాడిన గొప్ప యోధుడు కుమురంభీం అని కొనియాడారు. కుమురంభీం పోరాట స్ఫూర్తితోనే ఆదివాసీలు తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. ఆదివాసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. అనంతరం కుమురంభీం విగ్రహం వద్ద ఆదివాసీ నాయకులు జెండాలు ఎగురవేశారు. విగ్రహం వద్ద మహిళలు ప్రత్యేకపూజలు చేశారు. గ్రామంలో భాజాభజంత్రీలతో ర్యాలీ నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, ఎంపీటీసీ సభ్యులు గావుడే వనిత, నాయకులు నైతం సీతల్, ఆనంద్‌రావు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేకపూజలు



మహంకాళి విగ్రహం వద్ద భక్తుల సందడి

రెబ్బెన: ఇందిరానగర్‌లోగల కనకదుర్గ, స్వయంభూ మహంకాళి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. అమ్మవారి దర్శనం కోసం గ్రామాలతో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గతంలో కోరిన కోర్కెలు తీరిన భక్తులు తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తులు అమ్మవారికి ముడుపులు కట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సమాచారం తెలిసేదెలా?

- నిలిచిన ఉపాధి కూలీల పే స్లిప్‌లు
- తెలియని మస్టర్లు, వేతన వివరాలు
- జన్‌మన్‌రేగా యాప్‌పై అవగాహనేది?



తిర్యాణిలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు

తిర్యాణి: ఉపాధిహామీ పథకంలో మార్పుల కారణంగా కూలీలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఒక్కో కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకం అమలు చేస్తుండగా నిరుపేద కూలీలకు ఉపాధి లభిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1.23 లక్షల జాబ్ కార్డులుండగా 2.47 లక్షల మంది కూలీలు సభ్యత్వం కలిగి ఉన్నారు. జిల్లాలో 15 మండలాలుండగా ఒకటి, రెండు మండలాలు మినహాయిస్తే మిగతా ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు వేతన స్లిప్‌లు ఇవ్వడం లేదు. రెండేళ్ల క్రితం వరకు కూలీలకు సక్రమంగా పే స్లిప్‌లు అందజేశారు. ఆ తర్వాత వివిధ కారణాలతో నిలిపివేశారు. ప్రధానంగా పే స్లిప్‌లో కూలీ పేరు, పని ప్రదేశం, మస్టర్ల సంఖ్య, మిగతా పని దినాల సంఖ్య, రోజు కూలి తదితర వివరాలుంటాయి. దీంతో ఒక్కో కూలీ ఏ పని ప్రదేశంలో ఎన్ని రోజులు పని చేశారు.. ఎంత వేతనం వస్తుంది.. అనేది స్పష్టంగా అర్థమయ్యేది. ప్రస్తుతం స్లిప్‌లు పంపిణీ చేయకపోవడంతో కూలీకి వారానికి ఎంత వేతనం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతీ వారం వేతన వివరాలు కూలీలకు తెలియడం ద్వారా ఒక వారం తక్కువ పడితే, మరో వారం నుంచి గరిష్ట వేతనం కోసం అధికంగా పని చేసే అవకాశముంది.

కూలీలు నష్టపోయే అవకాశం

సాధారణంగా ఉపాధిహామీ పనులకు సంబంధించిన డబ్బులు పోస్టాఫీస్ లేదా బ్యాంక్ ఖాతాల ద్వారా చెల్లిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికీ సగానికి పైగా పోస్టాఫీస్ ఖాతాల్లోనే డబ్బులు జమవుతున్నాయి. అయితే సదరు కూలీలకు సంబంధించి దాదాపు ఒకేసారి రెండు లేదా అంతకన్నా ఎక్కువ వారాలకు సంబంధించిన చెల్లింపులు చేస్తుంటారు. అయితే జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అధికంగా నిరక్షరాసులైన కూలీలుండడంతో తమ ఖాతాల్లో ఎంత నగదు జమ అయ్యిందో తెలియని పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో బీపీఎంలు నగదు విత్ డ్రా సమయంలో గతంలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఒకవేళ కూలీల బ్యాంక్ ఖాతాల్లో వేతన డబ్బులు జమ అయినప్పటికీ దగ్గరలో ఏటీఎం సెంటర్లు అందుబాటులో ఉండని కారణంగా మినీ ఏటీఎం నిర్వాహకులను ఆశ్రయించి నగదు విత్‌డ్రా చేసుకునే సమయంలోనూ అక్రమాలు జరిగే అవకాశం లేకపోలేదు. అయితే ఉపాధిహామీ కూలీలకు సంబంధించిన వేతన వివరాలను జన్‌మన్‌రేగా యాప్‌లో పొందుపరుస్తున్నప్పటికీ ఆ యాప్‌పై క్షేత్ర స్థాయిలో కూలీలకు అవగాహన లేకపోవడంతో అది ఉపయోగపడటం లేదు. ఉపాధిహామీ సిబ్బంది జన్‌మన్‌రేగా యాప్‌పై అవగాహన కల్పించాలని, వేతన స్లిప్‌లు ఇవ్వాలని కూలీలు కోరుతున్నారు.

ఎంత వస్తుందో తెలుస్తలేదు



ఉపాధిహామీ పనులకు రోజూ వెళ్తా. రోజుకు కూలి ఎంత వస్తుందో తెలుస్తలేదు. నాలుగైదు వారాలకోసారి వేతనాలను పోస్టాఫీస్ ఖాతా నుంచి విత్‌డ్రా చేసుకుంటున్న. బీపీఎం ఎన్ని డబ్బులు ఇస్తే అంతే తీసుకుని వస్తున్న. వారానికి ఎంత జమ అవుతున్నాయో అర్థమైతలేదు.

– విజయ, ఉపాధి కూలీ, గోలేటి

అధికారులను కోరుతాం



ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలందరికీ ప్రతీ వారం తప్పనిసరిగా పే స్లిప్‌లు అందజేయాలి. చిన్న కారణాలను సాకుగా చూపెడుతూ స్లిప్‌లు ఇవ్వకపోవడం సరికాదు. పే స్లిప్‌లు ఇవ్వాలని మా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధికారులను కోరుతాం.

– నర్సయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

యాప్‌లో పొందుపరుస్తున్నాం

ఉపాధిహామీ కూలీల వేతన వివరాలు ఎప్పటికప్పుడు జన్‌మన్‌రేగా యాప్‌లో పొందుపరుస్తున్నాం. జిల్లాలో లక్ష్యానికి తగినట్లు కూలీలు పనులకు రాకపోవడంతో పే స్లిప్‌ల పంపిణీకి అవసరమైన మెటీరియల్ సరఫరా కావడంలేదు. జిల్లాలో కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం. జన్‌మన్‌రేగా యాప్‌పై క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సురేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

క్లుప్తంగా

మామిడి తోట దగ్ధం



కాలిబూడిదైన కంచె కొయ్యలు

నెన్నెల: మండలంలోని గొల్లపల్లిలో గడ్డం మల్లాగౌడ్‌కు చెందిన నాలుగెకరాల మామిడి తోటలో 30 చెట్లు దగ్ధమైంది. కంచె కొయ్యలు కాలిబూడిదయ్యాయి. ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని బాధిత రైతు కన్నీరు మున్నీరయ్యాడు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నాడు. గతంలో కొందరు వ్యక్తులు కంచె కొయ్యలను ధ్వంసం చేశారని తెలిపాడు. ఈ మేరకు నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉరివేసుకుని మహిళ అత్మహత్య

కోటపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సర్వాయిపేటకు చెందిన సపటా నారక్క(55) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లో ఉరివేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త బాలయ్యనాయక్ గమనించి ఆమెను కిందకు దింపి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. ఏఎస్సై కాంతారావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



చుక్కల దుప్పి కళేబరం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కదంబా అటవీ ప్రాంతంలో ఆదివారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిందని ఎఫ్‌ఆర్వో రమాదేవి తెలిపారు. ఆదివారం ఉదయం కడంబా భీమన్న ఆలయం సమీపంలోకి చుక్కల దుప్పి రాగా, అక్కడ ఉన్న కుక్కలు దాడి చేసి హతమార్చినట్లు పేర్కొన్నారు.

కౌటాలలో..



దుప్పి కళేబరం

కౌటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో శనివారం చుక్కల దుప్పి మృతి చెందింది. ఫారెస్ట్ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా పంచనామా చేసి పాతిపెట్టిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందినట్లు అటవీ అధికారులు తెలిపారు. కానీ చుక్కల దుప్పి మృతి వివరాలు గోప్యంగా ఉంచడంపై జంతుప్రేమికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వేటగాళ్ల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిందా.. వీధికుక్కల దాడిలో మృతి చెందిందా అని ప్రశ్నిస్తున్నారు.

రైతులూ జాగ్రత్త..!

- విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం
- కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- గుర్తింపు పొందిన విత్తనమే మేలు

జిల్లాల వారీగా..

జిల్లా	సాగు విస్తీర్ణం
మంచిర్యాల	3.42 లక్షలు
ఆదిలాబాద్	5.56 లక్షలు
నిర్మల్	4.30 లక్షలు
కుమురంభీం ఆసిఫాబాద్	4.80 లక్షలు



బస్తాల్లో పలు కంపెనీల పత్తి విత్తనాల ప్యాకెట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్/నేరడిగొండ: మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. విత్తనాలు, ఎరువులు సమాకుర్చుకునే సమయం దగ్గరపడింది. ఈ సమయంలో పలు కంపెనీల విత్తనాల, పురుగుల మందుల ప్రచారం జోరుగా ఊపందుకుంది.పుట్టగుడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలు సాగిస్తున్నాయి. కంపెనీల యాజమాన్యాలు ఉమ్మడి జిల్లాలోని డీలర్లకు ప్యాకేజీలు, విదేశీ టూర్ల ఆఫర్ చేస్తున్నాయి. పత్తి విత్తనాలకు సంబంధించిన కంపెనీలు ఆయా గ్రామాల్లో రైతులను ఆకట్టుకునేలా వాహనాల్లో వచ్చి కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. మైక్‌సెట్ ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్లకు చేరుతున్నాయి. ఆయా కంపెనీల వలలో రైతులు మోసపోకుండా అప్రమత్తండా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఆకర్షణీయ ప్రకటనలకు లోనుకావద్దు

ఆయా కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు లోబడి విత్తనాలు కొనుగోలు చేయరాదు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో..గుర్తింపు లేని లేబుల్‌తో కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలు రైతులకు అంటగడుతున్నాయి. కంపెనీలపై విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్ని సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. విత్తన కంపెనీపై ప్రభుత్వ నిబంధనల వివరాలు ఉన్నాయో జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా విత్తనాల్ని ఉత్పత్తి చేసే కంపెనీపై నమ్మకం ఉండాలి.

నాణ్యమైన విత్తనాలు కొనాలి

ప్రభుత్వ లైసన్స్ కలిగిన డీలర్ల వద్దనే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్న విత్తనాల రసీదు తమ వద్ద పెట్టుకోవాలి. బీటీ–3 పేరిట నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు.

– సురేఖ, మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి

విత్తనాలు కొనేముందు..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన ఆధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి
- బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనవద్దు.
- విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యేంత వరకు భద్రపర్చాలి
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనే ముందు..

- ఆధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

పురుగు మందు కొనే ముందు..

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందు కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు.
- వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించొద్దు.

కారు ఢీకొని ఉపాధి కూలీ మృతి



లచ్చన్న (ఫైల్)



పంచనామా చేస్తున్న ఎస్సై మృత్యుంజయ సర్కార్

జన్నారం: కారు ఢీకొని ఉపాధి కూలీ మృతిచెందిన ఘటన మండలంలోని రోటిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. రెండవ ఎస్సై మృత్యుంజయ సర్కార్, మృతుడి మనుమడు పానగంటి కిరణ్ తెలిపిన వివరాలు.. రోటిగూడకు చెందిన కందుల లచ్చన్న (68) శనివారం ఉదయం సమీప అటవీ ప్రాంతంలోని ఉపాధి హామీ పనికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మహ్మదబాద్ సమీపంలో అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన లచ్చన్నను లక్సెట్టిపేట ఆస్పత్రికి అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదివారం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారు తిర్యాణి మండలం గిన్నెధరి గ్రామానికి చెందిన మడావి శ్రీనివాస్‌గా గుర్తించారు. మృతుడి మనుమడు కిరణ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తెకు వివాహమైంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సెకండ్ ఎస్సై రామయ్య

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామానికి చెందిన రాథోడ్ రాజేందర్(31) చికిత్స పొందుతు మృతి చెందాడు. స్థానిక ఎస్సై చంద్రకుమార్ కథనం ప్రకారం.. రాజేందర్‌కు జన్నారం మండల మొర్రిగూడకు చెందిన సుజాతతో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈనెల 21న మొర్రిగూడలోని అమ్మవారి ఆలయంలో పూజకు వెళ్లగా భార్య తరపున కుటుంబీకులతో జరిగింది. తీవ్ర మనస్తాపం చెందిన ఆయన ఈనెల 25న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి నాందేవ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన చీపిరిశెట్టి గణేశ్ (23) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఏఎస్సై చాంద్‌పాషా కథనం ప్రకారం.. గణేశ్ శనివారం రాత్రి తన టాటాఏస్ ట్రాలీని కరెంట్ కట్టర్ మిషన్‌తో కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి వివాహం కాలేదు. మృతుడి తల్లి కొమురమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చేపల వలలో చిక్కుకుని ఒకరు..

ముల్కల శివారులోని ఓ మడుగులో చేపలు పట్టేందుకు వెళ్లి తను వేసిన వలలో చిక్కుకుని మగశిర సబర్(31) మృతిచెందాడు. ఏఎస్సై చాంద్‌పాషా కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సబర్ మూడు నెలల క్రితం ముల్కల్ల శివారులోని ఇటుక బట్టీల్లో కూలీ పని చేసేందుకు వలస వచ్చాడు. శనివారం సాయంత్రం అక్కడే సమీపంలోని ఓ మడుగులో చేపలు పట్టేందుకు వల వేసి వచ్చాడు. తిరిగి రాత్రి మడుగు దగ్గరకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి తను వేసిన వలలో చిక్కుకుని మృతిచెందాడు. సోదరుడు చక్రధర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్ కోతలు లేకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

భీమారం: మండలంలో వి ద్యుత్ కోతలు లేకుండా చ ర్యలు తీసున్నామని ఏఈ కుమార్ తెలిపారు. విద్యు త్తు కోతలతో దహన సంస్కారాలకు ఇక్కట్లు శీర్షికన 'సాక్షి'లో ఆది వారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వర్షాకాలం మెరుగైన విద్యుత్ అందించేందుకు కిష్టంపేట నుంచి మండల కేంద్రానికి వచ్చే 33 కేవీ విద్యుత్తు లైనుపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపట్టామన్నారు. ఈమేరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ముందస్తుగానే ప్రజలకు సమాచారం ఇచ్చామన్నారు. అనుకోకుండా గ్రామంలో మహిళ మరణించడంతో దహన సంస్కారాల కోసం బంధువులు, స్నేహితులు విద్యుత్ సరఫరా చేయాలని అడిగారని అన్నారు. ఆ సమయంలో సి బ్బంది విద్యుత్ స్తంభాలపై ఉండడంతో సి బ్బందికి సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరా చేశామని తెలిపారు. అప్పటికే దహన సంస్కారాలు పూర్తి చేశారని పేర్కొన్నారు. అధికారికంగా ఎలాంటి కోతలు లేవని స్పష్టం చేశారు.

పేకాటస్థావరంపై దాడి

జైపూర్: మండలం నర్వ గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం దాడి నిర్వహించారు. పక్కా సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.54,710 నగదుతోపాటు 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముగిసిన భగవద్గీత శిక్షణ



పారాయణంలో పాల్గొన్న చిన్నారులు

జన్నారం: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో చిన్నారులకు 30 రోజుల పాటు నిర్వహించిన భగవద్గీత శిక్షణ ఆదివారం ముగిసింది. పారాయణం చేసే విధంగా, శ్లోకం అర్థాలను వివరించారు. చివరి రోజు ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. బాసెట్టి సత్యవతి నెల రోజులపాటు చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వర్తక సంఘం నాయకులు జక్కు సత్తయ్య, గుండా సుధాకర్, పూజారి గణేశ్‌శర్మ, నాయకులు గంగాధర్, శంకరయ్య, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి



సీతారాం (ఫైల్)

బెజ్జూర్: బైక్ అదుపు తప్పి ఒకరు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన ఇట్యాల సీతారాం(55) తన కుమారుడు అంజన్న కలిసి ఆదివారం రాత్రి బైక్‌పై మండలంలోని కృష్ణపల్లికి వెళ్తున్నారు. మాందారి వెంకటేశ్ సైకిల్‌పై ఎదురెదురుగా వస్తుండగా బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో అంజన్న, సీతారామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సీతారాం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి

భైంసాటౌన్:పట్టణంలోని పార్డి(బి) బైపాస్‌రోడ్ ఎన్‌బి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కదం ప్రీతి(31) మృతి చెందారు. మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తుండగా, రెండేళ్లుగా పట్టణంలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.ఈక్రమంలో ఆమె అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం మృతిచెందారు. దీంతో ఉపాధ్యాయవర్గాలు ఆమె మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



చెన్నూర్ ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ 1975–77 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు 49 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నానాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్వర్గస్తులైన గురువులు, తోటి మిత్రులకు నివాళులర్పించారు. అనంతరం గురువులు పులి రామన్న, సాధిక్ అలీ, అడువాల లచ్చయ్య, రెవెల్లి రామయ్యను సన్మానించారు. బెల్లంకొండ మోహన్‌రావు, కరుణసాగర్ రావు, ఉప్పు వామన్‌రావు, సునర్ల సురేశ్, అక్బర్‌తోపాటు 40 మంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ యూపీఎస్‌లో 1987–93వ సంవత్సరంలో 6 నుంచి 8 తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. స్థానిక కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అపూర్వ సమ్మేళనానికి హాజరై సందడి చేశారు. ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు రాజమల్లయ్య, నాగమల్లేశ్వర్, సుదల్పన, సువర్ణ, కుబ్జాదేవి, సునంద, నిర్వాహకులు రమేశ్, నళినికాంత్, సురేందర్, మల్లేశ్, జావిద్, గోపి, సుధాకర్ వినోద్ పాల్గొన్నారు.



క్రిష్ణకాలనీకి సరస్వతీ శిశుమందిర్‌కు చెందిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మంచిర్యాలలో

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు కట్ట వెంకటరెడ్డి, శంకరయ్య మిగతా విద్యార్థులను సన్మానించారు. జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. విద్యార్థులు ప్రభాకర్, ప్రశాంత గంగాధరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

24 ఏళ్ల తర్వాత..

కృష్ణకాలనీకి చెందిన సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ఉపాధ్యాయులు 24 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చంద్రోశేకర్, విజయలక్ష్మి పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు.



ఉపాధ్యాయులతో సరస్వతీ శిశుమందిర్ పూర్వ విద్యార్థులు

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన 3.25 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న విత్తనాలు, విక్రయిస్తున్న ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. పక్కా సమాచారంతోనే గత నాలుగు రోజుల క్రితం గూడెం ప్రాణహిత నది వద్ద నకిలీ విత్తనాలను తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. మండలంలోని గంగాపూర్‌కు చెందిన చాపిలె పురుషోత్తం, సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన బొల్లబోయిన అశోక్‌ను అదుపులో తీసుకుని విచారించారు. డబ్బా గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు భారీ మొత్తంలో ఉన్నట్టుగా తేలింది. గ్రామ శివారులో సోదాలు నిర్వహించగా భారీ మొత్తంలో పట్టుబడ్డాయి. పట్టుబడ్డ 3.25 క్వింటాళ్ల విత్తనాల విలువ సుమారు రూ.8.12 లక్షలు ఉంటుందని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పురుషోత్తం, అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విద్యుత్‌షాక్‌తో ఆవులు మృతి

తాంసి/తలమడుగు: తలమడుగు మండలం లింగి శివారు పొలంలో ఆదివారం రెండు ఆవులు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయి. మేత కోసం ఆవులు వెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.50 వేల వరకు ఉంటుందని తాంసి మండలం గిరిగాం గ్రామానికి చెందిన బాధిత రైతులు విలాస్, జ్ఞానేశ్వర్ తెలిపారు. అధికారులు పరిహారం అందించాలని కోరారు.

సింగరేణి కార్మిక సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి కార్మికుల సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే పరిష్కరించేలా చూడాలని మావోయిస్టు పార్టీ సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన పత్రికలకు లేఖ విడుదల చేశారు. గత ప్రభుత్వాలు కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడిందని ఆరోపించారు. ఓపెన్‌కాస్ట్‌లు రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికే బీఆర్ఎస్‌ని కార్మికులు పాతర వేశారని గుర్తు చేశారు. శాశ్వత కార్మికుల సంఖ్య తగ్గిస్తూ కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య పెంచుతున్న యాజమాన్యం భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. కాంగ్రెస్ సింగరేణిని ప్రైవేటీకరించకుండా చర్యలు చేపట్టాలని, బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణ రద్దు చేయాలని, సింగరేణికి ప్రభుత్వం నుంచి రావల్సిన రూ.25 వేల కోట్లను విడుదల చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేసి రూ.25 లక్షల హెల్త్‌కార్డు ఇవ్వాలని కోరారు. కార్మికులకు సొంతింటి పథకం కింద 350 గజాల స్థలం, రూ. 25 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని పేర్కొన్నారు. సింగరేణిలో యూనివర్సిటీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, రిటైర్డ్ కార్మికులకు ఐదేళ్లకోసారి పింఛన్ 20 శాతం పెంచాలని, కార్మికులు మరణిస్తే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

సౌత్‌ఇండియా అదనపు ప్రధాన కార్యదర్శిగా రఘుపతిరావు

మంచిర్యాలఅర్బన్: హ్యూమన్‌రైట్ కౌన్సిల్ ఫర్ ఇండియా సౌత్ ఇండియా అదనపు ప్రధాన కార్యదర్శిగా రఘుపతిరావును నియమించిన ట్లు జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహారావు తెలిపారు. వి శాఖపట్నంలో ఆదివారం జరిగిన మహాసభలో ఆయనకు నియమాకపత్రం అందజేశారు. రా ష్ట్ర అధ్యక్షుడు తిరుమల్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజులు రఘుపతిరావును సన్మానించారు.